
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28, కనిష్టంగా 14 వేలు, సరాసరిన 18 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13 పలికింది. మార్కెట్‌కు 120 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.35	సెహరీ : 4.59



న్యూస్‌రీల్

గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్‌పై విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న ఏజీఎం రాజేందర్‌రెడ్డి

లేపాక్షి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై గురుకుల పాఠశాలల కర్నూలు ఏజీఎం రాజేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. మార్చి 26వ తేదీన కళాశాల ప్రార్థన సమయంలో ప్రిన్సిపాల్ ప్రసాద్ విద్యార్థుల సమక్షంలోనే తమను కించపరిచేలా ''వీరంతా పనిచేయడానికి కాకుండా తిండి తినేందుకు వస్తున్నారు'' అంటూ దూషించారని అతిథి అధ్యాపకులు, విద్యార్థులు ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌కు, కర్నూలు రీజియన్ ఏజీఎంకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఏజీఎం రాజేందర్‌రెడ్డి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, అతిథి అధ్యాపకులతో వేర్వేరుగా సమావేశమై విచారించారు. అంతేకాకుండా ప్రిన్సిపాల్‌పై చేసిన ఆరోపణలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, అతిథి అధ్యాపకులు ఇచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఖాద్రీశుని హుండీ కానుకల లెక్కింపు



హుండీల్లోని నగదు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కించారు. 15 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.45,22,374 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపు బుధవారం కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, ఆలయ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

కదిరి: రానున్న ఎన్నికల్లో జిల్లా నుంచి పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. కదిరి నుంచి కె.ఎస్. షానవాజ్, పుట్టపర్తి నుంచి మధుసూదన్‌రెడ్డి, హిందూపురం నుంచి వి.నాగరాజు, మడకశిర నుంచి కరికెర సుధాకర్, రాప్తాడు నుంచి ఆది ఆంధ్ర శంకరయ్య, పెనుకొండ నుంచి వి.నరసింహప్ప పేర్లను అధికారికంగా ప్రకటించింది. అయితే ధర్మవరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎవరు పోటీ చేస్తారనేది సస్పెన్స్‌లో ఉంచింది.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



పుట్టపర్తి అర్బన్: ఏపీ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో సూచించారు. శిబిరాల ద్వారా నైపుణ్యమున్న క్రీడాకారులను గుర్తించి వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లాలో మొత్తంగా 50 వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే శిబిరాల్లో పాల్గొనే వారికి శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి కలిగిన క్రీడా శిక్షకులు, పీఈటీ, పీడీ, సీనియర్ ప్లేయర్లు, సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన శిక్షకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బాలబలికలు, శిక్షకులు ఈనెల 8వ తేదీలోపు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. వివరాలకు 9849421462 నంబరులో సంప్రదించాలన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

'మాకు ఇల్లు లేకపోతే ఇల్లు ఇచ్చినాడు. ఆటో నడిపే మా ఆయనకు రూ.10 వేలు ఇస్తున్నాడు. నాకు గ్రూపుల డబ్బులు సంవత్సరానికి రూ.18 వేలకుపైగా ఇస్తున్నాడు. పిల్లోన్ని బడికి పంపినందుకు ఏటా రూ.15 వేలు ఇస్తున్నాడు. దాంతోపాటు మంచి బట్టలు, మంచి భోజనం, మంచి బూట్లు, సాక్సులు, స్కూలు బ్యాగు, కొత్త బుక్కులు చెప్పుకుంటూ పోతే ఇంకా చాలానే ఉన్నాయి. మా అత్తకు నెలకు రూ. 3వేల పింఛన్ ఇస్తున్నాడు. మాకు ఎకరా భూమి ఉంటే వైఎస్సార్ రైతుభరోసా కింద ప్రతిసారీ రూ.13,500 ఇస్తున్నాడు. మాకు ఇంతకన్నా ఇంకేం కావాలి. అందుకే మాకు జగనన్న అంటే ఇంత అభిమానం. మళ్లా జగనే రావాల. మా ఆడోళ్ల ఓట్లన్నీ జగన్‌కే'

...జగన్‌ను చూసేందుకు సోమవారం మధ్యాహ్నం మండుటెండలో ముదిగుబ్బ మండలం మలకవేముల క్రాస్ వద్ద వేచి చూస్తున్న నర్సమ్మను పలకరిస్తే ఇలా చెప్పుకొచ్చింది.

'మాకు అన్ని అర్హతలున్నా... చంద్రబాబు పాలనలో ఇల్లు మంజూరు కాలేదు. జన్మభూమి కమిటీ సభ్యుడు ఒప్పుకోవడం లేదని అప్పట్లో అధికారులు చెప్పారు. కానీ ఏ నాయకుడి రెకమెండేషన్ లేకుండానే ఈ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. అందుకే మళ్లీ జగనే కావాలని కోరుకుంటున్నా'

..కదిరి పట్టణానికి చెందిన పర్వీన్ భాను ఆనందమిది. ఆమె ద్విచక్ర వాహనానికి వైఎస్సార్ సీపీ జెండా కట్టుకుని జగన్ బస్సుయాత్ర ఆగిన సైదాపురం ఆంజనేయ స్వామి గుడి వద్దకు వచ్చింది.

'నేను ఇంతకు ముందు టీడీపీకి ఓటు వేయలేదని నాకు పింఛన్ వస్తుంటే పీకేశారు. నా బిడ్డ జగన్ రాగానే నాకు మళ్లీ పింఛన్ ఇస్తున్నాడు. అందుకే దూరం నుంచైనా ఆ బిడ్డను చూసి చల్లగా ఉండాలని దీవించాలని వచ్చాను. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్ని ఎవరితో పొత్తుపెట్టుకున్నా మళ్లీ వచ్చేది జగనే'

...కదిరిలో జగన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న సమయంలో బయట వేచి చూస్తున్న ఖాదర్‌బాషా అనే 85 ఏళ్ల వృద్ధుడిని కదిలించగా చెప్పిన మాటలివి..

జగన్ బస్సుయాత్ర సాగిన దారి పొడవునా ఇలాంటి అభిమానులెందరో కనిపించారు. కాస్త కదిలిస్తే చాలు మనస్సులో జగన్‌పై ఉన్న అభిమానం ఉప్పొంగగా... ఆనందభాష్పాల మధ్య గంటల తరబడి తమకు జరిగిన మేలును సంతోషంగా చెప్పారు. సాధారణంగా ఐదేళ్లకోసారి నాయకులు వచ్చి ప్రజల్ని ఓటు అడగడం చూశాం. కానీ ప్రజలే స్వచ్ఛందంగా ఇలా రోడ్డుపైకొచ్చి 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదిస్తూ నవ చరిత్రకు నాంది పలుకుతున్నారు.



సోమవారం బత్తలపల్లి మండలం తంబాపురం వద్ద వైఎస్ జగన్ బస్సుయాత్రకు స్వాగతం పలికేందుకు పరుగున వస్తున్న మహిళలు



రామాపురం వద్ద అభిమాన నేత జగన్‌తో కరచాలనం కోసం ఉత్సాహం చూపుతున్న దృశ్యం

ఏ నోట విన్నా ఇదే మాట

- 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు విశేష స్పందన
- ఊరూరా హారతులు పట్టి ఆహ్వానం పలికిన మహిళలు
- అభిమాన నేతను చూసి సంబరపడిన ప్రజలు
- సీఎం జగన్ రోడ్‌షో సక్సెస్‌తో నూతనోత్తేజం

కదిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాలోని ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర గ్రాండ్ సక్సెస్ అయింది. మండుటెండను లెక్క చేయకుండా దారి పొడవునా జనం రోజంతా తమ అభిమాన నాయకుడి కోసం ఎదురు చేశారు. కిలోమీటర్ల కొద్ది జనం రోడ్డుకిరువైపులా గంటల తరబడి బారులు తీరారు. కొందరు మహిళలైతే తమ చంటి పిల్లలను చంకనేసుకొని జగన్ బస్సు యాత్ర వెంట పరుగులు తీశారు. చాలాచోట్ల జగన్ ప్రయాణిస్తున్న బస్సుకు ఎదురెళ్లి హారతులు పట్టారు. పూలవర్షం కురిపిస్తూ సంబరపడ్డారు. బత్తలపల్లి, ముదిగుబ్బ, కదిరి, నల్లచెరువు, తనకల్లు..ఇలా మండల కేంద్రాలే కాకుండా ఏ గ్రామం వద్ద చూసినా ఒక్కటే జనం.

డీలా పడ్డ టీడీపీ శ్రేణులు

జిల్లాలో వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన రోడ్‌షోలకు వచ్చిన జనాన్ని చూసి టీడీపీ కూటమి నేతలు డీలా పడ్డారు. ఇటీవల టీడీపీతో పాటు జనసేన, బీజేపీ ఈ మూడు పార్టీలు కలిసినా చంద్రబాబు సభకు కదిరిలో జనం పెద్దగా రాలేదు. కానీ సోమవారం కదిరిలో జగన్ రోడ్ షోలో పాల్గొన్న జనాన్ని చూసి 'ఇంకెక్కడ చంద్రబాబు..మళ్లీ జగన్ ప్రభుత్వమే వస్తుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు' అని టీడీపీకి మాజీ జెడ్పీటీసీ ఒకరు అన్నారు.

వైఎస్సార్‌సీపీలో ఉరకలేస్తున్న ఉత్సాహం

జగన్ బస్సుయాత్ర జనసాగరాన్ని తలపించగా.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. కదిరిలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత అత్తార్ చాంద్‌బాషా చేరికతో వైఎస్సార్ సీపీకి ఇక్కడ మరింత బలం వచ్చినట్లయింది. అలాగే పుట్టపర్తి నియోజకవర్గం టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్, అమడగూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పొట్టా పురుషోత్తంరెడ్డి వైఎస్సార్ సీపీలో చేరడంతో అక్కడ కూడా పార్టీకి బాగా ఊపు వచ్చింది. రాప్తాడులో జరిగిన సిద్ధం సభ, ప్రస్తుతం 'మేమంతా సిద్ధం' పేరుతో జగన్ చేపట్టిన బస్సు యాత్రకు జనం నుంచి వస్తున్న స్పందన చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. 'మళ్లీ అధికారం జగన్‌దే' అని అందరినోటా ఇదే మాట వినబడుతోంది.

పోస్టల్ బ్యాలెట్లు సిద్ధం

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. తుది జాబితా అనంతరం వస్తున్న క్లెయిమ్‌లను పరిష్కరించుకుంటూ, నూతన ఓటరుగా నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఇక పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించింది. ఇప్పటికే నియోజకవర్గ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఇప్పటికే పలుమార్లు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ వారంలో మరోసారి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ శిక్షణలో ఎన్నికల నియమావళి, సూచనలకు సంబంధించిన కరదీపికలను అందజేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం సుమారు 12 వేల బ్యాగ్‌లను సిద్ధం చేశారు.

జిల్లాలో 22 వేల పోస్టల్ బ్యాలెట్లు

ఎన్నికల నిర్వహణ పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లను అధికారులు సిద్ధం చేశారు. ఈ సారి ఎన్నికల్లో అధికారులతో పాటు కవరేజీకి వెళ్లే విలేకరులకు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులకు, 40 శాతంపైగా అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. వీరంతా ఫారం–12డీ ద్వారా ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో సుమారు 22 వేలకు పైగా పోస్టల్ బ్యాలెట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేసి సిద్ధం చేస్తున్నారు. పార్లమెంట్ నియోజక వర్గం అభ్యర్థికి గ్రీన్ కలర్ కవర్, అసెంబ్లీ నియోజక వర్గం అభ్యర్థికి పింక్ కలర్ కవర్‌లో పోస్టల్ బ్యాలెట్లు వేయాల్సి ఉంటుంది. ఇందు కోసం వేలాది కవర్లు కలెక్టరేట్‌లో సిద్ధం చేశారు. వీటిని త్వరలోనే ఆయా నియోజకవర్గాలకు పంపనున్నారు.



పోస్టల్ బ్యాలెట్‌కు అవసరమైన కవర్లు

నేటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

- ఈసీ ఆదేశాలతో పింఛన్ బాధ్యతల నుంచి వలంటీర్ల తొలగింపు
- సచివాలయాల్లోనే అందజేయనున్న ఉద్యోగులు
- రోగులు, దివ్యాంగులకు మాత్రం ఇంటివద్దే పింఛన్


పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ నుంచి వలంటీర్లను తొలగించిన దృష్ట్యా సచివాలయ ఉద్యోగులు సచివాలయాల్లోనే పింఛన్ పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 544 గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా సంబంధిత సెక్రటరీలు 3వ తేదీ నుంచి 6వ తేదీలోపు పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయాలని సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు, షామియానాలు ఏర్పాటు చేసి పింఛన్ మొత్తాన్ని అందజేయాలని ఆదేశించింది. జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు 2,72,760 ఉండగా, వారి కోసం ప్రభుత్వం రూ.81,41,37,500 మంజూరు చేసింది. సంబంధిత మండల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసి ఆయా సచివాలయ సెక్రటరీలకు అందజేస్తారు. వారు సచివాలయంలోనే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

కొందరికే ఇంటివద్ద పింఛన్

దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారు, నడవలేని వారు, బలహీనమైన వారు, మంచం పట్టిన వారు, వీల్‌చైర్‌కే పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందే వారికి మాత్రం మానవతా దృక్పథంతో ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందజేయాలని సెర్ప్ సూచించింది. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు చర్యలు చేపట్టారు.

భానుడి భగభగలతో పెరిగిన ఉక్కపోత, గతంలో ఎన్నడూ లేని విధంగా విస్తరించిన పారిశ్రామిక కార్యకలాపాలు, బోరు బావుల్లో తగ్గని నీటి లభ్యత.. తదనుగుణంగా పెరిగిన వ్యవసాయ కార్యకలాపాలు వెరసి ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. మునుపెన్నడూ లేనంత రికార్డు స్థాయికి చేరింది. అయినా, ఎక్కడా చిన్నపాటి అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేస్తుండడం గమనార్హం.

పెరిగిన పవర్



- ఉమ్మడి జిల్లాలో భారీగా విద్యుత్తు వినియోగం
- ఫిబ్రవరి తర్వాత 40 శాతం ఎక్కువగా వాడకం
- అయినా కోతల్లేకుండా కరెంటు సరఫరా
- అధికారుల ముందస్తు కార్యాచరణతో సత్ఫలితాలు
- 2019కి ముందుతో పోలిస్తే భారీగా తగ్గిన ట్రాన్స్‌ఫార్మర్ల నష్టాలు
- జీరో బ్రేక్‌డౌన్‌తో 33 కేవీ, 11కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు 20 మిలియన్ యూనిట్లకు పైగా అంటే 2 కోట్ల యూనిట్లు విద్యుత్ ఖర్చవుతున్నట్టు తేలింది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 12 మిలియన్ యూనిట్ల వినియోగం ఉండేది. ఇప్పుడది 20.989 మిలియన్ యూనిట్లకు చేరింది. అయినా ఉదయం పూటే 9 గంటలు వ్యవసాయానికి అందిస్తుండడం గమనార్హం. మరోవైపు గృహావసరాలకు 24 గంటలూ సరఫరా కొనసాగుతోంది.

గ్రేటర్ రాయలసీమ పూర్వపు జిల్లాల్లో సగటున రోజుకు కరెంటు వినియోగం (మిలియన్ యూనిట్లలో)

జిల్లా	వినియోగం
నెల్లూరు	36.12
చిత్తూరు	27.333
వైఎస్సార్	16.467
అనంతపురం	20.989
కర్నూలు	14.595

రోజుకు రూ.167.91 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్ 2 నాటికి ఉన్న డిమాండ్‌ను బట్టి రోజుకు ప్రభుత్వానికి రూ.167.91 కోట్ల వ్యయమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక యూనిట్ విద్యుత్‌ను రూ. 8తో కొనుగోలు చేస్తోంది. ఇందులో గృహావసరాలకు రూ.2తోనూ, కమర్షియల్‌కు స్లాబును బట్టి వసూలు చేస్తుండగా.. వ్యవసాయ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తున్న కరెంటు కోసం ఏడాదికి రూ.2 వేల కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 2019కి ముందు రాష్ట్రంలో వ్యవసాయానికే కాదు గృహావసరాలకు కూడా కోతలతో అల్లాడి పోయేవారు. ఇప్పుడా పరిస్థితి ఏ గ్రామంలోనూ లేదు.

మెరుగుపడిన ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు

గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఉండేది. అయితే, ప్రభుత్వ చర్యల కారణంగా నేడు అలాంటి పరిస్థితులే లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,76,016 ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయి. గడిచిన మూడేళ్లలో సగటున ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్య శాతం 7.53గా ఉంది. అంతే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 33కేవీ, 11కేవీ ఫీడర్లు 1232 ఉండగా జీరో బ్రేక్‌డౌన్‌తో నడుస్తున్నాయి. అదే 2014–19 కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్య శాతం (డీటీఆర్ ఫెయిల్యూర్) 16 శాతం ఉండేదని అధికారులు చెబుతున్నారు.

పక్కా కార్యాచరణ

ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎక్కడా కరెంటు కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించాం. ఒక్క రైతు కూడా కరెంటు లేక పైరు నష్టపోకూడదన్నదే మా సంకల్పం. ఇందుకోసం పక్కా కార్యాచరణతో ముందుకెళుతున్నాం. ఈ రెండు నెలలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులను ఆదేశించాం.

– గౌతమి, కలెక్టర్

కోతలు లేకుండా చూస్తున్నాం

గతంతో పోల్చితే విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. అయినా, ఎక్కడా కోతలు లేకుండా కరెంటు సరఫరా చేస్తున్నాం. బోరుబావులు ఎక్కువగా ఉన్న జిల్లా కాబట్టి వినియోగం కూడా అధికమే. ఈనెలాఖరుకు వరి పంట పూర్తవుతుంది. అనంతరం విద్యుత్తు వినియోగం తగ్గే అవకాశం ఉంది.

– సురేంద్ర, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్

ఆర్టీసీ ఉద్యోగి సస్పెన్షన్

పెనుకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్–2గా పనిచేస్తున్న రామాంజినేయులుపై సస్పెన్షన్ వేటు పడింది. 4 ,5 రోజులుగా తన విధులకు ఎగనామం పెడుతూ అనంతపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకట ప్రసాద్ తరఫున ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటూ వస్తున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సార్వత్రికం.. సారథులు సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ అరుణ్‌బాబు
- నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి
- జిల్లా ఎన్నికల నిర్వహణ అంతా వీరి కనుసన్నల్లోనే
- ఎన్నికల నిర్వహణకు 12 వేల మంది సిబ్బంది



జిల్లా ఎన్నికల సారథులు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్



జిల్లా కలెక్టర్ కార్యాలయం

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారి మొదలు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ప్రిసైడింగ్ అధికారి, సెక్టోరియల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్ల, బీఎల్‌ఓల వరకూ..ఇలా ప్రతి ఒక్కరూ కీలక బాధ్యతలే చూస్తుంటారు. రెండు నెలల ముందే ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణ పనుల్లో బిజీగా మారింది. నూతన ఓటరుగా నమోదు, ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, అధికారులకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ర్యాంపులు, ట్రై సైకిళ్ల ఏర్పాటు వంటి పనులు పూర్తి చేస్తున్నారు. మొత్తంగా ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖలకు చెందిన సుమారు 12 వేల మంది సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సారథుల బాధ్యతలు ఏమిటో ఒక సారి చూద్దాం..

జిల్లా ఎన్నికల అధికారి

ఎన్నికల విధులను పర్యవేక్షించడానికి, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు జిల్లాకు ఒక అధికారిని ఎన్నికల కమిషన్ నియమించింది. అందులో భాగంగా కలెక్టర్ అరుణ్‌బాబును జిల్లా ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో కలెక్టర్ కీలక పాత్ర పోషించనున్నారు. ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయడంతో పాటు జిల్లాలో ఎన్నికల నిర్వహణ ముఖ్య బాధ్యతలన్నీ కలెక్టర్ చేతిలోనే ఉంటాయి. ఇటు పాలనా పరంగా సాధారణ విధులతో పాటు ఎన్నికల విధులనూ ఆయన నిర్వర్తించనున్నారు.

రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)

ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి నియోజక వర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)ని నియమించారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజక వర్గాలకు ఆయా ఆర్డీలు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకటశివరామిరెడ్డి ఆర్‌ఓలు వ్యవహరిస్తున్నారు. పెనుకొండకు సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి జేసీ అభిషేక్ కుమార్, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓగా అహుడా చైర్మన్ గౌరీ శంకర్‌లను నియమించారు. నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు, తుది జాబితా తయారీ ఆర్‌ఓలే చేస్తారు. ఇక పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర పనులను ఆర్‌ఓలు పర్యవేక్షిస్తారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి(ఏఆర్‌ఓ)

నియోజకవర్గ స్థాయి ఆర్‌ఓకు సహాయకారిగా తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఏఆర్‌ఓలుగా నియమిస్తారు. ఆర్‌ఓ బాధ్యతలను వీరు పంచుకొని త్వరగా పూర్తయ్యేలా చేస్తారు. ఆర్‌ఓకు ప్రతి దశలోనూ సహాయం చేస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ఆయా పోలింగ్ బూత్‌లకు తరలిస్తారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ చేసి స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. ఇతనికి ఏపీఓ సహాయకారిగా ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలను వీరు పర్యవేక్షిస్తారు.

సెక్టోరియల్ అధికారి

వీరు కనీసం 8 నుంచి 10 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అవకాశం సెక్టోరియల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌లు గుర్తించి అక్కడ బందోబస్తుకు సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గంలో ప్రతి మండలానికి 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. రోజులో ఒక్కో బృందం 8 గంటల పాటు విధులు నిర్వర్తిస్తారు. వీరి పరిధిలో అక్రమ మద్యం, డబ్బు, ప్రలోభాల కోసం తరలించే సామగ్రి అక్రమ రవాణ జరగకుండా తనిఖీలు చేస్తారు. అక్కడైనా పట్టుబడితే సదరు వస్తువులను పోలీస్, ఐటీ, సెబ్ తదితర శాఖల అధికారులకు అప్పగిస్తారు.

మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికల జరిగే తీరును ఎన్నికల కమిషన్‌కు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదిక రూపంలో పంపడంలో వీరు కీలకంగా వ్యవహరించనున్నారు. రోజూ సాయంత్రం 5 గంటలకు ఒక నివేదికను పంపాల్సి ఉంటుంది.

బీఎల్‌ఓలు

కొత్తగా ఓటు నమోదు దరఖాస్తులను అందజేయడం, దరఖాస్తు అనంతరం పరిశీలించడం, వాస్తవ నివేదికలు అధికారులకు ఇవ్వడం, ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం, బీఎల్‌ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై అధికారులకు తెలియజేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పులపై నివేదించడం తదితర సేవలను అందిస్తారు.

ఓటర్ల నమోదు అధికారి


ఓటరు జాబితాను తయారు చేయడం ఈయన బాధ్యత. ఎక్కడైనా ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా ఉంటే వీరిని సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. ఈయన పర్యవేక్షణలో కొంత మంది సిబ్బంది ఉంటారు.

ఎన్నికల నిబంధనలు ఇవే

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులంతా అప్రమత్తమయ్యారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారు.

- ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123(1) కింద ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బయాందోళనలు కలిగించటం, కుల, మత విద్వేషాలను పెంచడం, ఎదుటి వారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం ఈ సెక్షన్ కిందకు వస్తాయి.
- సెక్షన్ 125 ప్రకారం శత్రుత్వం కలిగించడం నేరం. సెక్షన్ 126 ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో ప్రచారం చేయడం చట్ట విరుద్ధం.
- సెక్షన్ 127 ప్రకారం ఇతరుల సమావేశాలను భంగపరచడం.
- సెక్షన్ 128 ప్రకారం రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించడం నేరం. సెక్షన్ 130, 131, 132 ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేయడం, క్రమశిక్షణ లేకుండా బూత్‌ల వద్ద ప్రవర్తించడం, హద్దు మీరి వ్యవహరించడం నేరం.
- సెక్షన్ 133 ప్రకారం ఓటర్లను చేరవేసేందుకు వాహనాలు ఉపయోగించడం నేరం. సెక్షన్ 134 ప్రకారం ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేయడం నేరం.
- సెక్షన్ 135, 135–ఏ, 136 ప్రకారం పోలింగ్ స్టేషన్లు ఆక్రమించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, రికార్డులు ధ్వంసం చేయడం, తొలగించడం, నాశనం చేయడం నేరం.
- సెక్షన్ 171జీ ప్రకారం ఎన్నికలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేయడం, 172 హెచ్, 172 ఐ ప్రకారం ఖర్చు చేసిన నిధులకు లెక్కలు చెప్పక పోవడం వంటివి తదితర నేరాలన్నీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోకి వస్తాయి.

పంటకు చీరకట్టు



మగువకు చీర కట్టు తెచ్చిన అందం గురించి ఎన్నో వర్ణనలు ఉన్నాయి. ఆరు మూరల చీర ఆడపిల్ల కడితే చాలా అందంగా కనపడుతుందనడంలో అతిశయోక్తి లేదు. అంతటి ఘనత కలిగిన మన భారతీయ సంప్రదాయ చీర... పంటను చుట్టుకొని రక్షణ కవచంగా మారింది. ఆరుగాలం రైతులు కష్టపడి పండిస్తున్న టమాట పంటను ఎండ బారి నుంచి రక్షించుకునేందుకు పాత చీరలను రక్షణ కవచాలుగా ఏర్పాటు చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం శివారులో కనిపించిన ఈ దృశ్యం చూపరులను కనువిందు చేస్తోంది. మగువకే కాదు... పంటకూ చీరకట్టు అందం తీసుకువస్తుందని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

నగదు పట్టివేత

హిందూపురం అర్బన్: స్థానిక రహమత్‌పుర కూడలిలో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.1 లక్ష నగదు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు లేకుండా అనుమానాస్పదంగా నగదు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మద్యం స్వాధీనం

లేపాక్షి మండలం కల్లూరు గ్రామానికి చెందిన నందీష్ మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు సెబ్ సీఐ రాజశేఖరగౌడ్ తెలిపారు. తిరుమల దేవరపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో పది బాక్సుల్లో తరలిస్తున్న కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే సిరివరం గ్రామానికి చెందిన ఆదినారాయణప్ప సైతం ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తూ పట్టుబడినట్లుగా తెలిపారు.

నగదు చోరీ

గోరంట్ల: స్కూటర్ డిక్కీలో ఉంచిన నగదును దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్లలోని వనప్పనగర్‌లో నివాసముంటున్న మిలటరీ ఉద్యోగి మదన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం తన భార్య తాహెరాభానుతో కలసి స్థానిక ఎస్‌బీఐ శాఖకు చేరుకుని ఆమె ఖాతాలోని రూ.5.9 లక్షలను డ్రా చేశారు. ఆ మొత్తాన్ని స్కూటర్ డిక్కీలో ఉంచి ఇంటి వద్ద భార్యను వదిలి పిల్లలను పిలుచుకుని వచ్చేందుకు స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాల వద్దకు చేరుకున్నాడు. పాఠశాల మైదానంలో స్కూటర్ నిలిపి తరగతి వద్దకెళ్లి పిల్లలను పిలుచుకు వచ్చేలోపు దుండగులు డిక్కీని బద్దలుగొట్టి నగదు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

అరటి తోట దగ్ధం

మడకశిర రూరల్: మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో రైతు రంగనాథ్ సాగు చేసిన అరటి తోటకు మంగళవారం మంటలు వ్యాపించి దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు ఎగిసి పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద శబ్దంతో పేలింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానించిన కండెక్టర్‌ను కట్ చేశారు. మూడు ఎకరాల్లో సాగు చేసిన అరటి పంట కోత దశలో ఉందని, దిగుబడితో పాటు డ్రిప్ పరికరాలు దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు. కాగా, ప్రమాదంలో రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయుడిపై వేటు

చిలమత్తూరు: మండలంలోని వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రంగారెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈఓ మీనాక్షి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగరాజు మంగళవారం తెలిపారు. ఆదివారం చేనేపల్లిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తరఫున ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడాన్ని కలెక్టర్ అరుణ్‌కుమార్ తీవ్రంగా పరిగణిస్తూ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.

సిరా గుర్తు.. ప్రగతికి మెట్టు



హిందూపురం టౌన్: 'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఓటు విలువను ఎన్నికల సంఘం తెలియజేస్తోంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి సాధారణంగా ఎడమ చేతి చూపుడు వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా చుక్క పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం కూడా. ముఖ్యంగా చర్మంపై పూసిన ఈ సిరాను త్వరగా తొలగించడం దాదాపు అసాధ్యం. వేలుపై పూసిన ఈ సిరా 15 నుంచి 30 సెకన్లలో పాడిబారుతుంది. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పడితే 72 గంటల నుంచి 96 గంటలు ఉంటుంది. ఈ సిరాను 1962 నుంచి కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 14 లేదా 18 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

బాల్య వివాహాలతో అనర్థాలెన్నో

- జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి డాక్టర్ కేసీకే నాయక్



మాట్లాడుతున్న డాక్టర్ నాయక్

పరిగి: బాల్య వివాహాలతో అనర్థాలు చాలా ఉన్నాయని జిల్లా ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి డాక్టర్ కేసీకే నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన పరిగి మండలంలో పర్యటించారు. తొలుత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హొన్నంపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. చదువు బాలికలకు ముఖ్యమన్నారు. చిన్నప్పుడే పెళ్లి చేయడం వల్ల బాలిక మానసికంగా, శారీరకంగా దెబ్బతింటుందన్నారు. పుట్టబోయే సంతానం సైతం అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతనూ పాటించాలని అప్పుడే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరిగి, ఊటుకూరు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి, సురేష్ కుమార్, రూబీ, సీహెచ్‌ఓ వన్నప్ప, డేటా మేనేజర్ సుబ్బారావు, పీహెచ్‌ఎన్ వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల ద్వారా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువగా ఎండల్లో ప్రజలెవరూ తిరగకుండా చూడాలన్నారు. ప్రజలు సైతం అత్యవసరమైన పనులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు రావాలన్నారు. వృద్ధులు, చిన్నారులను ఇంటికే పరిమితం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలు, పట్టణ కార్యాలయాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో చలివేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురి చేసే మద్యం, తేనీరు, కాఫీ, కార్బొనేటెడ్ పానీయాలు సేవించరాదన్నారు. సాధ్యమైనంత వరకూ ఎక్కువగా మజ్జిగ, బార్లీ, తాగునీరు తీసుకోవాలన్నారు. వడదెబ్బ సోకినట్లు ఎవరికైనా అనుమానం వస్తే వెంటనే బాధితుడిని చల్లని ప్రదేశానికి చేర్చి, వైద్యులను సంప్రదించాలన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రాంతంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ పని చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ఆర్టీసీ బస్టాండ్లో చలివేంద్రాలు, బస్సుల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, విద్యాశాఖ ఏడీ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పుష్పయాగోత్సవం



పుష్పయాగోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు



నృత్య రూపకంలో పాల్గొన్న చిన్నారులు

కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతా మూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. సాగనంపేందుకు నిర్వహించేదే ఈ పుష్పయాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు వివరించారు. తీర్థవాది ఉత్సవం ముగియగానే సోమవారం మధ్యాహ్నం నుంచి ఆలయం తలుపులు మూసి వేసి తిరిగి మంగళవారం ఉదయం తెరిచి మహా సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామివారికి నిత్య పూజాది కైంకర్యాలను నిర్వహించిన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం కలిగించారు. రాత్రి సమయంలో రంగమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూల అశ్వర్థ నారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ ఈఓ పట్టెం వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.